రైతుల ఆశలు ఆవిరి

- ఈనే దశలో ఊస తిరుగుతున్న వరి పైరు
- గింజలు తాలుగా మారి దిగుబడిపై ప్రభావం
- ఖరీదైన మందులు పిచికారీ చేసిన ఉత్తదే
- 40 ఏళ్లలో లేని పరిస్థితి అంటున్న అన్నదాతలు
- జిల్లాలో 2.71లక్షల ఎకరాలలో సాగు
- మొగిపురుగు ప్రభావంతోనే అంటున్న శాస్త్రవేత్తలు



గింజదశలో తాలుగా మారిన చేను



ఫొటోలోని రైతు పేరు అనిల్. మండలంలోని మల్లన్నపల్లి గ్రామం. మూడెకరాల్లో దొడ్డురకం సాగు చేశాడు. నారుమడి నుంచే మొగిపురుగు సోకడంతో ఖరీదైన మందులు పిచికారీ చేశాడు. చేను గింజపట్టే దశకురాగానే 40శాతం గింజలు తాలుగా మారాయి. ఎకరాకు 40 బస్తాలకు బదులు 27 బస్తాల దిగుబడి వచ్చుడు గగనమే, పది రోజుల్లోనే చేను మొత్తం తాలుగా మారడంతో బోరునవిలపించాడు. ఇప్పటికే ఎకరాకు రూ.28 వేల పెట్టుబడి పెట్టానంటూ వాపోయాడు.

వీణవంక: పైరు ఏపుగా పెరిగింది. ఐదుసార్లు రసాయన మందులు పిచికారీ చేసిన. ఇకా చేనుకు ఢోకా లేదు. కనీసం 40 బస్తాల దిగుబడి వస్తుందని రైతులకు నిన్నటి వరకు ధీమా ఉండేది. తీరా పైరు ఈనే దశకు చేరుకుంది. పది రోజుల్లోనే చేను ఊసతిరుగుతోంది. 70 శాతం గింజలు తాలుగా మారుతున్నాయి. కనీసం 20 బస్తాల దిగుబడి వస్తుందో లేదో అని ఇప్పుడు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులకు యాసంగి సాగు కలిసిరాలేదు. నారుమడి నుంచే పురుగు ప్రభావంతో రైతులు నానా తంటాలు పడ్డారు. తీరా పైరు ఈనే దశ వచ్చే సరికి గింజలు తాలుగా మారుతుండటం, 40ఏళ్లలో ఎప్పుడు ఇటువంటి దుస్థితి చూడలేదని, వానాకాలంలో వేరుకుళ్లు తెగులుతో నష్టపోయామని రైతులు బోరునవిలపిస్తున్నారు.

దొడ్డురకం పైనే ఎక్కువ ప్రభావం..

జిల్లాలో 2.71 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్టు అధికారుల అంచనా. దొడ్డురకం వరి ఎక్కువగా సాగు చేశారు. మొదట్లో మొగిపురుగు ప్రభావం తీవ్రంగా ఉండటంతో రైతులు పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డారు. తీరా పైరు ఈనే దశలోకి రాగానే ఊసతిరుగుతుండటం రైతులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. సన్నరకంపై ప్రభావం లేకపోయినా దొడ్డురకంపై బెడద ఎక్కువగా ఉంది. నాలుగేళ్లుగా దొడ్డురకం సాగు చేస్తున్న రైతులు ఆశించిన దిగుబడి తీయలేకపోతున్నారు. వివిధ రకాల తెగుళ్లు ఆశిస్తుండటంతో ఏటా దిగుబడి లేక నష్టపోతున్నారు. దొడ్డురకం కాలపరిమితి తక్కువ కావడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉందని రైతులు మొగ్గు చూపారు. దొడ్డురకం ఏటా రైతులను నిండా ముంచుతుండటంతో కనీసం పెట్టుబడి రాని దుస్థితి నెలకొంది.

మందులు పిచికారీ చేసినా..

మొగిపురుగును నివారించేందుకు రైతులు మందులు పిచికారీ చేశారు. పిలక దశలో పురుగు వ్యాప్తి చెందితే చేను ఈనే దశలో దాని ప్రభావం కనబడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మందులు పిచికారీ చేసినా మళ్లీ విజృంభించిందని మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన పోరెడ్డి తిరుపతిరెడ్డి రైతు వాపోయాడు. పురుగు ప్రభావంతోనే గింజలు తాలుపోవడం జరుగుతోందని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 80వేల ఎకరాలకు పైగా ఊసతిరిగిందని సమాచారం.

నష్టపరిహారం అందించాలి

మొగిపురుగును నారుమడి నుంచే నిర్మూలించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. అదేవిధంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. అయినా పురుగును నివారించలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, ఊసతిరుగుడుతో మిల్లర్లు తిరకాసు పెడుతారని, కొనుగోళ్లలో కోతలు విధిస్తారని వాపోతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వరి గింజ పట్టేదశలో ఉంది. కానీ వరి గొలుసు ఊస తిరుగుతోంది. గింజలు తాలుగా మారి చేను అంత ఎండిపోయినట్లు కనిపిస్తోంది. గతంలో లేని విధంగా ఖరీదైన రసాయన మందుల వాడినా చేను అదుపులోకి రాలేదు. దొడ్డురకం వరికే ప్రభావం ఎక్కువగా ఉంది. ఎకరాకు 20 బస్తాల దిగుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులకు సాయం చేయాలి.

– అప్పని హరీశ్‌వర్మ, రైతు, రామక్రిష్ణాపూర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కేంద్రబలగాలతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ రవి, పోలీసుల కవాతు

జమ్మికుంట: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ పరిధి రామన్నపల్లి, మండలంలోని మడిపల్లి గ్రామాల్లో టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎస్‌ఐ రాజేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా సింగిల్‌విండో సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సింగిల్ విండో సమావేశం బుధవారం రసాభాసగా సాగింది. సమావేశంలో సీఈవో వీరస్వామి సంఘం ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈసందర్భంగా చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడారు. సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. నూతన భవనం నిర్మిస్తే కొంతమంది అడ్డుపడ్డారని విమర్శించారు. ఇప్పలపల్లి, అన్నారంలో భూమి కొనుగోళ్లపై వాగ్వాదం జరిగింది. చైర్మన్, మాజీ చైర్మన్‌ల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూమికొనుగోలు చేయాలని పలువురు రైతులు సూచించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, స్టాఫ్‌అసిస్టెంట్ వేణు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

జమ్మికుంట: పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బుధవారం వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు సాగునీరు ఏప్రిల్ 21వ తేదీ వరకు అందించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరమనేని పరుశరాంరావు, ఎక్కటి సంజీవరెడ్డి, బాలసాని రమేష్, కిరణ్, గుర్రపు సంపత్‌రెడ్డి, రాచపల్లి శ్రీనివాస్, లింగారెడ్డి, నాయినేని రాజేశ్వర్ రావు, పాపిరెడ్డి, రేణికుంట్ల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజబాబు, రవీందర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాగరాజు, మారపల్లి అంజనేయులు, అశోక్ పాల్గొన్నారు.

'మందకృష్ణను విమర్శిస్తే సహించం'



ఎంఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్

హుజూరాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాదిగ అన్నారు. బుధవారం ఎంఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. మందకృష్ణను విమర్శించిన కాంగ్రెస్ నాయకుడు సొల్లు బాబును పార్టీలో నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల కోసం పోరాడుతున్న మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మారెపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ఎంఈఎఫ్ నాయకులు మల్లయ్య, మొలుగూరి అశోక్, పెరుకు రఘుపతి ఉన్నారు.



బీటీరోడ్డు వేసేదాక తిప్పలే

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి–బేతిగల్ వరకు బీటీ రోడ్డు వేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. కంకర దస్ట్ పోయడంతో దుమ్ము లేస్తోందని, వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నామని. వెంటనే బీటీరోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అల్లుకున్న తీగచెట్టు



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో విద్యుత్ స్తంభం, వైర్లకు, తీగ చెట్టు అల్లుకుంది. బలమైన గాలులు వీస్తే విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు తీగను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో వొడితెల ప్రణవ్



నగదు లెక్కిస్తున్న రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు

ఆధ్యాత్మికం

దైవానుగ్రహంతో సుభిక్షంగా ఉండాలి

వీణవంక: దైవానుగ్రహంతో పాడిపంటలు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మండలంలోని పలు దేవాలయాల్లో బుధవారం నిర్వహించిన ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. చల్లూరులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల్లో పాల్గొన్నారు. మామిడాలపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొనగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్ల లావణ్యరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, నల్ల కొండల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మూల రజితపుల్లారెడ్డి, శ్రీరామోజు చంద్రమౌళి, మాజీ సర్పంచ్ బండ సుజాతకిషన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాదాడి శ్రీదేవి, తాళ్లపెల్లి తిరుమలేశ్, కనకం వెంకటస్వామి, నరసింహారెడ్డి, కొండల్‌రెడ్డి, సత్యనారాయణ, రాంగోపాల్‌రెడ్డి, ఉదా రపు నరసింహచారి, సజ్జాద్, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ కాన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవాసవి కాన్యకాపరమేశ్వరి ఆలయ 28వ వార్షికోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం అభిషేకం, హోమం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ద్రాక్షపండ్లతో అలంకరణ, 108 నైవేద్యాలు భక్తి శ్రద్ధలతో సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముక్క కాశయ్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు, శ్రీ వాసవి సేవా సమితి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. భక్తులు రూ.1,81,666 సమర్పించినట్లు దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ ఈవో అనిల్‌కుమార్, ట్రస్ట్ సభ్యుడు గోపాలరావు, ఆలయ సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, ఉమేష్, రాజరాజేశ్వర సేవాసమితి అధ్యక్షులు చంద్రకళ, సభ్యులు పాల్గొన్నారు.



అంగూర పండ్ల అలంకరణతో దర్శనం ఇస్తున్న అమ్మవారు



108 ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించిన భక్తులు

చేనేత అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చరణ్

హుజూరాబాద్: చేనేత సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు చరణ్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం 70వ వార్షిక, 81వ మహసభ జరిగింది. సభకు సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఎలిగేటి ఉపేందర్ అధ్యక్షత వహించగా, అభివృద్ధి అధికారి వై.శ్రీకాంత్‌రెడ్డి, బి.అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘ సభ్యులు నూతన ఆవిష్కరణల ప్రకారం వస్త్రాలను ఉత్పత్తి చేయాలన్నారు. చేనేత మిత్ర, త్రిఫ్ట డబ్బుల విడుదలకు, వస్త్రాల ఖరీదుకు సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. అధిక మొత్తంలో వస్త్రాలు ఉత్పత్తి చేయడం జరిగిందని, వస్త్రాల నిల్వతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆరునెలలుగా చేనేత మిత్ర డబ్బులు రావడం లేదని వెంటనే ఇప్పించాలని కోరారు. నాయకులు వేముల యాదగిరి, గుండేటి మహాదేవ్, సుధాకర్, సత్యనారాయణ, సుమలత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా చూడాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని నివాస గృహాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని సీడీఎంఏ దివ్య ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. నగరంలో 300 స్క్వేర్ మీటర్ల స్థలం దాటి నిర్మించుకునే అన్ని భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఆస్తిపన్ను వందశాతం వసూలు చేయాలని, ఈఈఎస్ఎల్ కంపెనీకి నగరపాలక సంస్థ బకాయిలు చెల్లించాలని సూచించారు. కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఆర్‌వో ఆంజనేయిలు, సందీప్, శ్రీహరి పాల్గొన్నారు.

అధికారులు సీరియస్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులోని రైస్‌మిల్లు వ్యాపారి కస్టం మిల్లింగ్ రైస్ మరపట్టించి ఎఫ్‌సీఐకి పంపించకుండా ఆలస్యం చేయడంతో సివిల్ సప్లై అధికారి మిల్లు యజమానిపై బుధవారం సీరియస్ అయ్యారని సమాచారం. సదరు వ్యాపారి అధికారిని బతిమిలాడినట్లు తెలిసింది.

క్లుప్తంగా

సహకార వార్షిక మహాసభ

సైదాపూర్: వెన్కెపల్లి విశాల సహకార సంఘం వార్షిక మహాసభ సంఘం ఫంక్షన్ హాల్‌లో బుధవారం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు సంఘం సభ్యులు ఇద్దరుముగ్గురు, డైరెక్టర్లు హాజరయ్యారు. సంఘం సీఈవో శ్రీధర్ లావాదేవీలు చదివి వినిపించారు. ఫంక్షన్ హాల్‌లో పనిచేస్తున్న ఎనిమిది మంది కూలీలు సభలో కూర్చోగా సభను మమ అనిపించారు.

నీటి వృథాను అరికట్టాలి

హుజూరాబాద్: కొందరు నీటిని వృథా చేస్తూ.. తాగునీటి ఎద్దడికీ కారకులవుతున్నారని, అందరూ బాధ్యతగా నీటి వృథాను అరికట్టాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ సూచించారు. బుధవారం పట్టణంలో మాట్లాడుతూ... ఈ సంవత్సరం తక్కువ వర్షపాతంతో నీటిఎద్దడి నెలకొందన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు అందిస్తుండగా కొందరు పట్టించుకోకపోవడం, విద్యుత్ మోటార్లు వినియోగిస్తూ తాగునీటి కొరత సృష్టిస్తున్నారని, ప్రజలలో చైతన్యం రానంతవరకు నీటివృథా జరుగుతూనే ఉంటుందని ఇప్పటికైనా ప్రజలు మేలుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. అధికారులు సైతం ప్రజలకు నీటి వృథాపై అవగాహన కల్పించి, తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

ఇల్లందకుంట: ఎంపీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఎస్సై రాజ్‌కుమార్ బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నగదు, బంగారం ఇతర వస్తువులు వాహనాల్లో తీసుకెళ్తే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. సరైనా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి, అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలకు జరిమానా విధిస్తామన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల నందన్ డెంగీతో మృతిచెందారు. మృతుడి కుటుంబాన్ని బుధవారం మాజీ ఎంపీ వినోద్‌కుమార్,మాజీ జెడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ, పరామర్శించారు.

బీఎస్పీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



జమ్మికుంట: మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె శ్రీనివాస్‌ను బీఎస్పీ(బహుజన సమాజ్ పార్టీ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా దొడ్డె శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్దంపల్లి మాజీ సర్పంచ్‌గా, 2007లో పార్టీలో చేరి జిల్లా ఉపాధ్యక్షుడిగా, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా, ఇంచార్జిగా పని చేశానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం, రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ తదితర ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడుతానని, నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి అంకని భానుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భవిష్య నిధిపై అవగాహన



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున డెయిరీలో బుధవారం సెల్వత్కర్ తానయ్య ప్రాంతీయ కమిషనర్–2 ఉద్యోగుల భవిష్య నిధిపై డెయిరీ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నోడల్ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోసాల నివారణ, పీఎఫ్ వాటా, పీఎఫ్ పథకాలు, కేవైసీ, జీవన ప్రమాణం సర్టిఫికెట్, సభ్యుల సమస్యల పరిష్కారం తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో పీఎఫ్ సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, డెయిరీ డైరెక్టర్ గణేష్‌రావు, ఏజీఎం ఆకునూరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899